

జాబ్‌మేళాలో 93 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటిఐలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 93 మంది తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారు. మేళాకు 211 మంది హాజరుకాగా, వీరికి అమర్ రాజా గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించారు. అభ్యర్థుల అర్హతలు, ఆసక్తిని బట్టి 93 మందిని ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, అమర్ రాజా గ్రూప్ హెచ్‌ఆర్ కల్యాణ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు హెచ్‌ఆర్ భాస్కర్, యంగ్ ప్రొఫెషన్ ఎం.యశ్వంత్ బాబు, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లవ్ అండ్ లైట్ సంస్థ నిర్లక్ష్యం

- ఆస్పత్రిలో చేరిన 20 మంది చిన్నారులు
- ఇద్దరి పరిస్థితి విషమం.. కెజిహెచ్‌కు తరలింపు

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

ఓ క్రిస్టియన్ మిషనరీ నిర్లక్ష్యం వల్ల మండలంలోని గిరిశిఖర గ్రామాలకు చెందిన 20 మంది గిరిజన విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. అందులో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విశాఖలోని కెజిహెచ్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. మిగతా 18 మంది శృంగవరపుకోటలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డిఎంహెచ్‌ఒ భాస్కరరావు పరామర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం..

సన్యాసమ్మ పరిస్థితి విషమించడంతో అత్యవసర చికిత్స అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గంట్యాడ మండలం రామవరం పంచాయతీ కరకవలస గ్రామంలో క్రిస్టియన్ మిషనరీకి చెందిన లవ్ అండ్ లైట్ సంస్థ పేద పిల్లలను గుర్తించి ఆశ్రయమిస్తోంది. సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో వారు విద్యనభ్యశిస్తున్నారు. శృంగవరపుకోట మండలంతోపాటు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 30 మంది గిరిజనుల విద్యార్థులు ఈ మిషనరీలో ఉంటున్నారు. కొద్దిరోజులుగా లవ్ అండ్ లైట్ సంస్థలో పెట్టే భోజనం, మంచినీరు నాణ్యత లేదు. దీంతో పిల్లలకు వాంతులు, విరోచనాలు కావడంతో మంగళవారం సాయంత్రం తల్లిదండ్రులకు ఫోన్ చేసి, పిల్లలకు అనారోగ్యంగా ఉందని, తీసుకుపోవాలని తెలిపారు. గిరిశిఖర గ్రామాల నుంచి కిందకు రావడానికి రహదారి సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో బుధవారం వచ్చి, పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. గురువారం ఉదయం చిట్టెంపాడుకు చెందిన ఆరుగురు విద్యార్థులకు వాంతులు, విరోచనాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న బొడ్డవర పంచాయతీ సర్పంచ్ మీనా, కార్యదర్శి బంగారినాయుడు వెంటనే ఆటోల ద్వారా ఐదుగురిని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సన్యాసమ్మను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ముందుగా తీసుకొచ్చారు. డాక్టర్ శ్రీనివాస్ వెంటనే ఆమెకు చికిత్స అందించారు. అయినా, సన్యాసమ్మతోపాటు మరో విద్యార్థి నవ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఇద్దరినీ విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. మిగతా 14 మంది విద్యార్థులను గురువారం సాయంత్రం ఆస్పత్రిలో చేర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

విద్యార్థుల గురించి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి.. ఆస్పత్రికి చేరుకుని, వారిని పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. తహశీల్దార్ అరుణకుమారి, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఇఒపిఆర్‌డి లక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ భరత్ ఆసుపత్రిలోనే ఉండి పిల్లలకు సరైన వైద్య సేవలు అందేలా చేశారు.

చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఆహారం, నీరు విషతుల్యం

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

లవ్ అండ్ లైట్ సంస్థలో ఆహారం, తాగునీరు విషతుల్యం కావడం వల్లే చిన్నారులు అనారోగ్యం బారిన పడ్డారని డిఎంహెచ్‌ఒ భాస్కరరావు తెలిపారు. ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించిన ఆయన.. వారికి అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అందరికీ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెట్టడం వల్లే వాంతులు, విరోచనాలు అయ్యాయని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అను, చైతన్య నాయుడు తెలిపారు. చిన్నారులను అడ్డం పెట్టుకొని, రూ.లక్షల్లో విరాళాలు సేకరించి, వారికి సరైన భోజనం కూడా పెట్టడం లేదని తెలిపారు. వెంటనే మిషనరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

98 శాతం మందికి పింఛన్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట, జామి, శృంగవరపుకోట

జిల్లా వ్యాప్తంగా వరుసగా రెండో నెలలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ విజయవంతంగా పూర్తయింది. తొలిరోజు గురువారం 98.05 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల్లోపే 96 శాతం మంది పింఛనుదారుల చేతుల్లోకి పింఛను మొత్తాలు చేరాయి. జిల్లాలో అన్ని రకాల పింఛనుదారులు 2,80,352 మంది ఉండగా, వీరిలో తొలిరోజు 2,74,881 మందికి పింఛన్లు అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛనుదారుల ఇళ్లకే వెళ్లి అందజేశారు. జులై నెలలో పంపిణీ సందర్భంగా చిన్నపాటి సాంకేతిక అవాంతరాలు తలెత్తి కొంత ఇబ్బందులు ఎదురైనా, ఆగస్టు నెల పింఛన్ల పంపిణీ సందర్భంగా అటువంటి లోపాలకు తావులేకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది.

పింఛనుదారులందరికీ తొలిరోజే పంపిణీ పూర్తిచేయాలని సంకల్పించామని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం తెల్లవారు జాము నుంచే కలెక్టర్ పర్యవేక్షించారు. ఉదయం 5 గంటల నుంచే అన్ని సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ ప్రారంభమైందీ, లేనిదీ పరిశీలిస్తూ పంపిణీలో వెనుకబడి ఉన్న సచివాలయాలను అప్రమత్తం చేశారు. జామి, శృంగవరపుకోట మండలం అలుగుబిల్లి, తిమిడి గ్రామాల్లో, లక్కవరపుకోట మండలం ఎల్.కె.ఎస్.పురం, విజయనగరం రూరల్ మండలం నెయ్యిలపేట గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. పలువురికి పింఛను మొత్తాలు అందజేసి గ్రామాల్లో పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు.

రేగిడి మండలం కొమిరిలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతుకు పొలంలో పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా కూడా కలెక్టర్ వెంట ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 5236 మంది సిబ్బందిని పింఛను మొత్తాల పంపిణీకి వినియోగిస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. అనంతరం డిఆర్‌డిఎ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మోనిటరింగ్ సెల్‌కు కలెక్టర్ చేరుకొని పంపిణీలో వెనుకబడి ఉన్న మండలాల్లో మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ బొండపల్లి మండలం అంబటివలస, గరుడబిల్లి గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

పొలాల్లో పింఛన్లు

జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పలుచోట్ల సచివాలయ సిబ్బంది పింఛనుదారులకు వారు పనిచేస్తున్న వ్యవసాయ క్షేత్రంలోకే వెళ్లి పింఛను మొత్తాన్ని అందజేశారు. దత్తిరాజేరు, మెంటాడ వంటి మండలాల్లో వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో వైద్య చికిత్స చేయించుకుంటున్న పింఛనుదారులకు ఆయా ఆసుపత్రులకు వెళ్లి పింఛన్లు అందించారు.

న్యాయమూర్తికి సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా ఒకటో అదనపు న్యాయమూర్తిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జి.రజనీని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎ.హరీష్, కార్యదర్శి విజి సంతోష్ ఆధ్వర్యంలో గురువారం బార్ కౌన్సిల్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రజనీ మాట్లాడుతూ తొలుత విజయనగరం కోర్టులో న్యాయవాద వృత్తి ప్రారంభించి, ఇక్కడే న్యాయమూర్తి గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వృత్తిలో ఆత్మగౌరవం, ఆత్మ విమర్శ, నిబద్ధతతో పనిచేసినప్పుడు తృప్తితోపాటు సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ న్యాయవ్యవస్థ వల్ల ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల రక్షణ, భద్రత ఉంటాయన్నారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందుబాటులో ఉండేలాచూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రజనీకి జ్ఞాపిక, పుష్ప గుచ్చాలు ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి రజనీని సన్మానిస్తున్న న్యాయవాదులు

ఆర్‌ఒబిలు పూర్తిచేయాలి

పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపి కలిశెట్టి

విజయనగరం కోట : విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని చీపురుపల్లి, మానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. పలు సమస్యలపై పార్లమెంటులో కలిశెట్టి గళం విప్పారు. చీపురుపల్లిలో అంతర్రాష్ట్ర సర్వీసులను మొదలు పెట్టాలని కోరారు. పార్వతీపురం, కొమరాడ మధ్య ఐదు కిలోమీటర్ల పరిధిలో మూడు రైల్వే గేట్లు ఉండడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాటికి బదులుగా ఆర్‌యుబిలు లేదా ఆర్‌ఒబిలు నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు ఉన్న మెట్రో రైల్ ప్రతిపాదనను పైడిభీమవరం పారిశ్రామికవాడ వరకు చేపట్టడం వల్ల ఆ ప్రాంతం చాలా అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు మెట్రో రైల్ ప్రాజెక్టును పైడిభీమవరం వరకు పొడిగించాలని కోరారు. విశాఖపట్నం నగరానికి మెట్రో రైల్ సర్వీసుల పనులు త్వరగా చేపట్టాలన్నారు. స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రి సత్వరమే ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

5న కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ధర్నా

విజయనగరం టౌన్ : ఎస్‌సి కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరణ చేయాలని ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వెంకటరమణ, ఆర్.ఆనంద్ తెలిపారు. గురువారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో టిడిపి ప్రభుత్వం హయాంలో 199 జిఒ తీసుకువచ్చి చర్మకారులకు, డప్పు కళాకారులకు స్వీయ దరఖాస్తు ఆధారంగా పింఛన్లు మంజూరు చేసిందని గుర్తుచేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు కార్డుల ఆధారంగా పింఛన్లు మంజూరు చేస్తామని సర్వేలు నిర్వహించడం సరికాదన్నారు. డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినా, చర్మకారులకు ఏ రకమైన గుర్తింపు కార్డులను ఇవ్వలేదని చెప్పారు. అలాంటప్పుడు పింఛను మంజూరు కోసం గుర్తింపు కార్డుతో ముడి పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ధర్నాలో డప్పు కళాకారులు, చర్మకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తల్లిపాలు అమృతతుల్యం

వారోత్సవాలను ప్రారంభించిన కలెక్టర్ అంబేద్కర్

తల్లిపాల శ్రేష్టతను వివరించే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తల్లిపాలు అమృతంతో సమానమని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను స్థానిక ఘోషా ఆసుపత్రిలో గురువారం కలెక్టర్ ప్రారంభించారు. తల్లిపాల శ్రేష్టతను వివరిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. తల్లిపాలు సహజ సమతుల్య ఆహారమని కలెక్టర్ అన్నారు. వీటిద్వారా శక్తితోపాటు ఎన్నో విలువైన పోషకాలు బిడ్డకు అందుతాయన్నారు. బిడ్డకు తన పాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. తల్లిపాల విశిష్టతపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు టీకాతో సమానమని అన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించడం వల్ల, అవి అమృతంలా పనిచేస్తాయని తెలిపారు. ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వవచ్చునని సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్, డిఐఒ డాక్టర్ అచ్యుతకుమారి, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడు, ఘోషాసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ సుజాత గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శుభశ్రీ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ

ఘోషాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తానని కలెక్టర్ అంబేద్కర్ హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు తమ సమస్యలను ఘోషా ఆసుపత్రిలో కలెక్టర్‌కు వివరించారు. తమకు జీతాలు సక్రమంగా రావడం లేదని, పిఎఫ్, ఇఎస్‌ఐ సదుపాయం కూడా లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి, జీతాలు ఇవ్వకపోవడానికి కారణాలను తమకు తెలియజేయాలని డిసిహెచ్‌ఎస్‌ను ఆదేశించారు.

ఆరోగ్యమిత్రపై కలెక్టర్ ఆగ్రహం

ఘోషా ఆసుపత్రి ఆరోగ్యమిత్రపై కలెక్టర్ అంబేద్కర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడి ఆరోగ్యమిత్ర శ్రీనివాసరావు పనితీరుపై ఆసుపత్రి డాక్టర్ ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ మండిపడ్డారు. తక్షణమే ఆరోగ్యమిత్రను విధుల నుంచి తప్పించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. అతని స్థానంలో వెంటనే వేరొకరిని నియమించాలని, ఆరోగ్యశ్రీ విభాగానికి ఒక కంప్యూటర్, స్కానర్‌ను సమకూర్చాలని కలెక్టర్ సూచించారు.

భద్రతా లోపాలే రైలు ప్రమాదానికి కారణం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జంషెడ్‌పూర్‌లో రైలు ప్రమాదానికి కారణం భద్రతలో లోపాలేనని డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం కానీ, పరిష్కరించడం కానీ చేయడం లేదని విమర్శించారు. ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైల్వేలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో పెద్దఎత్తున హడావుడి తప్ప సామాన్యులు ప్రయాణించే రైల్వే రంగంలో భద్రతా ప్రమాణాలు సరిగ్గా లేకపోవడం, తరచూ సాంకేతిక లోపాలతో ప్రమాదాలు సంభవించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తరచూ రైల్వే ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎమ్‌పిలు అడుగుతున్నా, దేశ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా స్పందించని రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైల్వే రంగం రక్షణ కోసం పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని వివిధ రైతు బజార్లు, పిడబ్ల్యుడి మార్కెట్, డి-మార్ట్, రిలయన్స్, స్పెన్సర్, మోర్ తదితర మార్టుల్లో శుక్రవారం నుంచి తగ్గింపు ధరకు కందిపప్పు, బియ్యం విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. దేశవాళీ కందిపప్పు కిలో రూ.155 నుంచి రూ.150కి, బియ్యం (స్టీమ్) బిపిటి, సోనామసూరి కిలో రూ.49 నుంచి రూ.48కి, బియ్యం (రా) కిలో రూ.48 నుంచి రూ.47కి తగ్గించి విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగ చేసుకోవాలని జెసి కోరారు.

నగరంలో కమిషనర్ పర్యటన

మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.ఎం.నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం కమిషనర్ ఎం.ఎం.నాయుడు పర్యటించారు. ఆ ప్రాంతాల్లో చేపడుతున్న పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గంటస్తంభం ప్రాంతంలో పర్యటించి అక్కడ ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాల గూర్చి చైతన్యపరిచారు. గంటస్తంభానికి ఆనుకొని ఉన్న ప్రధాన కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. రింగ్ రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించి వాహనాల రాకపోకల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆలస్యంగా వస్తున్న వాహనాల వివరాలను తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు.

మూడో డివిజన్‌లో వార్డు సందర్శన

నగరంలోని మూడో డివిజన్‌లో గురువారం కమిషనర్ ఎంఎం నాయుడు ఆధ్వర్యాన వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులతో కమిషనర్ ముచ్చటించి, అక్కడ పరిసరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వీధులలో చెత్తలు వేసిన వారిని మందలించారు. నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కమిషనర్ స్పందించి, విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, కార్పొరేటర్ వజ్రపు సత్యగౌరీ, ఎసిపి మధుసూదనరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, డిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం

ప్రజాశక్తి-విజయనగరం

సాంకేతిక విద్యకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమని సీతం విద్యాసంస్థల సెక్రటరీ, మాజీ ఎమ్‌పి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి తెలిపారు. అందుకు ప్రయోగశాలలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. గురువారం సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్ డిజైన్ ప్రయోగశాల, ఎలక్ట్రికల్ సిములేషన్ ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా జెన్‌టియు రూపొందించిన పాఠ్యాంశాల ఆధారంగా ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి రామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ (అడ్మినిస్ట్రేషన్) టి.డి.వి.ఎ.నాయుడు, ఇఇఇ విభాగాధిపతి వై.సంతోష్, డీన్ డాక్టర్ వై.నరేంద్ర పాల్గొన్నారు.



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్‌పి ఝాన్సీలక్ష్మి

విద్యార్థులకు కంటి పరీక్షలు

విజయనగరం టౌన్ : స్థానిక అయ్యప్పనగర్ వద్దనున్న మోడల్ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు గురువారం నిర్వహించారు. స్కూల్ హెల్త్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు మూడు నెలల పాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మోడల్ స్కూల్లో చదువుతున్న మొత్తం 653 విద్యార్థులకు రెండు రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కంటి పరీక్షల్లో అవసరమైన వారికి కళ్లజోళ్లు, మందులు సరఫరా చేస్తామని కంటి వైద్య నిపుణులు టి.మురళీకృష్ణ తెలిపారు. చికిత్స అవసరమైన వారిని మహారాజా జిల్లా సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రుక్సానా పర్విన్, ఆశావర్కర్లు వై.రాజేశ్వరి, ఎస్.లలితకుమారి పాల్గొన్నారు.

కట్టేశాం.. వదిలేశాం

- దిష్టిబొమ్మల్లా రాజీవ్ క్రీడా మైదానం షాపులు
- నాలుగేళ్లుగా అద్దెకు ఇవ్వని నగరపాలక, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు
- రూ.లక్షల్లో ఆదాయానికి గండి

నిరుపయోగంగా ఉన్న షాపులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'అనుకున్నాం.. కట్టేశాం.. వాటి వల్ల ఆదాయం వస్తే ఏంటి? రాకపోతే ఏంటి' అనే చందంగా ఉన్నాయి... నగర పాలక సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు. 31 షాపులు నిర్మించి నాలుగేళ్లు దాటుతున్నా వాటిని అద్దెకు ఇవ్వకుండా దిష్టిబొమ్మల్లా విడిచిపెట్టాయి. దీంతో అద్దెల రూపంలో రూ.లక్షల్లో రావాల్సిన ఆదాయం రాకుండా పోయింది.

విజయనగరం నగర పాలక సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో రాజీవ్ గాంధీ స్టేడియం ఆనుకొని 31 షాపుల నిర్మాణానికి గత టిడిపి ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. ఈ షాపులు అద్దెకు ఇవ్వడం ద్వారా క్రీడా ప్రాధికార సంస్థకు, నగర పాలక సంస్థకు ఆదాయం రావడంతో పాటు కొన్ని కుటుంబాలకు జీవనాధారం కల్పించాలనే ఉద్దేశంతో వీటిని నిర్మించారు. నగర పాలక సంస్థకు 70 శాతం షాపులు, క్రీడా ప్రాధికార సంస్థకు 30 శాతం షాపులు ఇవ్వాలన్న అంగీకారంతో షాపుల నిర్మాణం జరిగింది. దీంతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు 9 షాపులు, నగర పాలక సంస్థకు 22 షాపులు కేటాయించారు. షాపుల ద్వారా ఆదాయం వస్తే జిల్లాలో క్రీడలు అభివృద్ధికి, క్రీడలను ప్రోత్సహించేందుకు సహాయ పడుతుందని భావించారు. షాపుల నిర్మాణం 2020 సంవత్సరానికే పూర్తయింది. అప్పటికి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ షాపుల గురించి పట్టించుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత నగర పాలక సంస్థలో వైసిపి పాలకవర్గం వచ్చింది. వైసిపి పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా నాలుగేళ్లుగా షాపులు దిష్టిబొమ్మలా ఉన్నాయి తప్ప వినియోగంలోకి తీసుకు రాలేదు. నాలుగేళ్లలో షాపు ఒక్కటి రూ.5 వేలకు అద్దెకు ఇచ్చినా నెలకు రూ.1.55 లక్షలు అద్దె వచ్చి ఉండేది. అందులో క్రీడా ప్రాధికార సంస్థకు రూ.45 వేలు, నగర పాలక సంస్థకు రూ.1,10,000 ప్రతి నెల ఆదాయం వచ్చేది. ఈ లెక్కన నాలుగేళ్లకు రూ.93 లక్షలు ఆదాయం రాకుండా పోయింది. నాలుగేళ్లుగా వృథాగా పడి ఉండటంతో షాపుల ముందు కాలువ ఉండటంతో పాటు, అదే ప్రాంతంలో ప్రైవేటు బస్సులు నిలిపేస్తుండడం, ఆ ప్రాంత వాసులు బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో షాపుల వద్దకు ఎవరూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు షాపుల కిటికీలు, తలుపులు పాడైపోతున్నాయి. షాపుల ద్వారా అద్దె వస్తే క్రీడలకు, క్రీడా మైదానంలో వసతులకు ఆ డబ్బులు ఉపయోగపడేవి. వాటిని వినియోగించకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు షాపులు అడ్డగా మారాయి. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు,క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

కొద్ది రోజుల్లో అద్దెకు ఇచ్చేస్తాం

రాజీవ్ గాంధీ స్టేడియం ఆనుకొని నిర్మించిన షాపులలో మాకు కేటాయించిన 9 షాపులు కొద్ది రోజుల వ్యవధిలో అద్దెకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. రోస్టర్ పద్ధతిలో అద్దెకు ఇవ్వనున్నాం. ఒక్కో షాపును రూ.8వేల అద్దెకు ఇస్తాం. అద్దెకు సంబంధించిన నోటీసు పెడతాం.

– డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి
www.prajasakti.com

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

రామభద్రపురం: కుష్టు వ్యాధి నిర్మూలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బృందం (సెంట్రల్ లెప్రసీ ట్రెయినింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) డైరెక్టర్ డాక్టర్ వీరకుమారన్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ కె కుమారన్ తెలిపారు. మండల కేంద్రంలో పిహెచ్‌సిని గురువారం వారు సందర్శించారు. పిహెచ్‌సిలో కుష్టు రోగులకు సంబంధించిన రికార్డుల నిర్వహణను పరిశీలించారు. గత నెల 18వ తేదీ నుంచి ప్రారంభించిన లెప్రసీ ఇంటింట సర్వే పరిస్థితిపై స్థానిక వైద్యాధికారులు దిలీప్ కుమార్, శిరీషలను ఆరా తీశారు. గ్రామాల్లో ఇప్పటికే గుర్తించిన రోగుల ఇంటికి వెళ్లి పరిశీలించడంతో పాటు స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి పిల్లలను పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో లెప్రసీ రోగులు ఎక్కువ మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో 4,275 మంది అనుమానితులను గుర్తించామని వీరికి పూర్తిస్థాయిలో పరీక్షలు జరిపిన తర్వాత వ్యాధి నిర్ధారణ చేస్తామని స్పష్టం చేశారు.

పీజీ ప్రవేశకోర్సు ఇన్ సర్వీస్ కోటా కొనసాగించాలి

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న వైద్యులు

నెల్లిమర్ల: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశ కోర్సు ఇన్ సర్వీస్ కోటా కొనసాగించాలని ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు, సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె. సాయిరాం కోరారు. గురువారం ఆయన ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం తెచ్చిన ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జిఒ 85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం తరపున డాక్టర్ ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ 85ను వెనక్కి తీసుకొని ఇన్ సర్వీస్ కోటాను మునుపటి లాగా కొనసాగించాలన్నారు.

కాలిబాటలతో తెగుళ్ల నివారణ

నెల్లిమర్ల: వరిలో కాలి బాటలు వేయడం ద్వారా తెగుళ్ళు నివారణ చేయవచ్చని ఎఒ ఎం.పూర్ణిమ తెలిపారు. గురువారం పినతరిమిలో రైతులకు వరిపంట తెగుళ్ళు నివారణపై ఎఒ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరినాట్లు కొనలు తుంచి బీజామృతంతో శుద్ధి చేసి తాడు సహాయంతో వరుసలలో వేయించడం, కాలిబాటలు ప్రతీ 2మీటర్లకు 20సెంటి మీటర్లు తీసుకోవాలన్నారు. ఈ విధంగా నాట్లు వేయడం వల్ల గాలి వెలుతురు బాగా తగిలి చీడ పీడలు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నాగరాజు, పాల్గొన్నారు.

'క్వారీకి సహకరించలేం'

భోగాపురం: క్వారీని గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని రామచంద్రపేట గ్రామస్తులు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో క్వారీ ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే లోకం మాధవి, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు, గ్రామస్తులతో కలిసి ఆర్‌డిఒ సూర్యకళ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వారీ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. దీనికి గ్రామస్తులు ఒప్పుకునేది లేదని తెలిపారు. బంగార్రాజు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తే ఇబ్బందులు పడతారని అన్నారు. అవసరమైతే మరో చోట ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే అక్కడ ఉన్న క్వారీలతో ఇబ్బందులు పడుతుండటం వల్ల వారు ఒప్పుకోవడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.సురేష్, జిఎంఆర్ సంస్థ ప్రతినిధి సుబ్బారావు, గ్రామ పెద్దలు కోలా రామ సూరి, దుక్క రమణ, గొంప నరసింహ, ఎల్ అండ్ టి సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేయండి

బొబ్బిలి: రోడ్లపై పశువులు విడిచిపెడుతున్న యజమానులకు నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. రాణిమల్లమ్మదేవి, యుద్ధ స్తంభం పార్కును, పట్టణంలో పారిశుధ్య పనులను గురువారం పరిశీలించారు. రోడ్లపైకి పశువులు విడిచిపెడుతున్న యజమానులను గుర్తించి నోటీసులు ఇవ్వాలన్నారు. పార్కులో లైట్లు వేసి రంగులు వేయాలన్నారు. పార్కును శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను ఆదేశించారు.

కేరళ వరద బాధితులకు సహాయనిధి సేకరణ

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితులకు గురువారం సహాయ నిధిని సేకరించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి ఈరన్న, పి భాస్కరరావు, అధ్యాపకులు ఎస్కే వలిఖాన్, సిహెచ్ శ్రీనివాసరావు, కే అప్పలరాజు, డి లక్ష్మణ్, కే రామకృష్ణ, పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కార్ఫ్‌డేలో భాగంగా గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్కౌట్ ఉద్యమ స్థాపకులు బేడెన్ పౌల్‌కి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎరాజు మాట్లాడుతూ కొత్తగా స్కౌట్ యూనిట్‌లో చేరిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ప్రమాణ స్వీకార ఉత్సవం నిర్వహించామన్నారు.

రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావాలి

డెంకాడ: కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ. నాగభూషణం కోరారు. గురువారం ఆయన పలు బ్యాంకర్లను కలిసి కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. అనంతరం డెంకాడలో వరినాట్లును పరిశీలించి రౌతులకు పలు సూచనలు చేశారు. నాట్లు వేసినపుడు కాలి బాటలు విడిచిపెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ పూడి నిర్మల, పూసపాటిరేగ ఎఒ నీలిమ, ఎఇఒలు రామకోటి, ప్రశాంతి, వివిఎ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తొలగింపులు నిలిపేయాలి

డెంకాడ: డెంకాడ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమంగా తొలగింపునకు చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో రొంగలి రమణమ్మ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనాలు వండుతున్నారని చెప్పారు. ఇటీవల మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో హెచ్ఎం నిర్వాహకులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఇది చాలా అన్యాయమని చెప్పారు. వారినే కొనసాగించాలని కోరారు.

తోకలవలస సచివాలయంలో చోరీ

రేగిడి: మండలంలోని తోకలవలస సచివాలయంలో బుధవారం అర్ధరాత్రి ఛోరీ జరిగింది. గుర్తు తెలియన దుండగులు సచివాలయం తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలోని వాలంటీర్లకు సంబంధించిన 16 సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. వాస్తవానికి ఒకటో తారీఖన పింఛన్ల డబ్బులు ఉంటాయన్న ఆలోచనతో చోరీకి యత్నించినా డబ్బులు లేకపోవడంతో వెనుదిరిగారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రాకేష్ గురువారం తెల్లవారు విధులకు హాజరయ్యే సరికి సచివాలయం తాళాలు పగలు గొట్టిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎఎస్ఐ రాజారావు సచివాలయానికి చేరుకుని పరిశీలించారు. శుక్రవారం క్లూస్ టీమ్‌తో రానున్నట్లు తెలిపారు.

కిడ్నాప్‌పై కేసు నమోదు

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన కాపుగంటి గణేష్ (15)ను కిడ్నాప్ చేసినట్లు వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు వివరాలు ప్రకారం.. కాపుగంటి సన్యాసిరావు ఎస్‌కోటలో గల ఎస్ఎంఎఫ్‌జి బ్యాంక్ నుంచి కొంత సొమ్మును అప్పుగా తీసుకున్నారు. వాయిదాల ప్రకారం సొమ్ము చెల్లించలేదు. దీంతో ఆయన ఇంటి వద్ద లేని సమయంలో కొంత మంది వచ్చి కుమారుడు గణేష్‌ను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న తండ్రి సన్యాసిరావు యాజమాన్యంతో మాట్లాడినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

రైతు సేవా కేంద్రంలో చోరీ

బొబ్బిలిరూరల్ : శివడవలస రైతు సేవా కేంద్రంలో చోరీ జరిగి కంప్యూటర్, ప్రింటర్ ఎత్తుకెళ్ళి నట్లు వ్యవసాయ శాఖ ఏడి యం. శ్యాం సుందర్ తెలిపారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని బాలుడు దుర్మరణం

బొబ్బిలి: స్థానిక జయప్రకాష్ పాఠశాల రోడ్డులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏడో తరగతి విద్యార్థి ఓమ్మెల మణికంఠ దుర్మరణం చెందారు. ఓంకార్ టాకీస్ ఎదురుగా నివాసముంటున్న మణికంఠ శివాలయం వీధిలో నివాసముంటున్న మామయ్య వాళ్ల ఇంటికి సైకిల్ పై వెళ్తుండగా కింద పడిపోవడంతో గుర్తు తెలియని వాహనం తల పైనుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతుడు మణికంఠ గొల్లపల్లి జిఎన్ఎస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- అనుమానస్పద వ్యక్తుల కదలికలపై నిఘా
- ఖాళీగా ఉన్న ఇళ్లల్లో నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు : జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురపల్లి

నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. గురువారం నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురపల్లి పోలీసు స్టేషన్‌లను ఆయన సందర్శించారు. స్టేషను ప్రాంగణాన్ని, పోలీసు బిల్డింగ్ లోని గదులను, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీలించారు. పోలీసు స్టేషను ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, ఆయా వాహనాలు ఏ కేసులోనిది తెలిసే విధంగా ట్యాగ్ చేయ్యాలని, రికార్డు మెయింటెయిన్ చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ ను తనిఖీ చేశారు. పోలీసు శాఖ ప్రతిష్ఠ పెంచే విధంగా సిబ్బంది ప్రవర్తన ఉండాలని, అనైతిక చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ సిబ్బంది ఎప్పటి నుండి పని చేస్తున్నది, వారు నిర్వర్తిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, స్టేషనులో క్రైమ్ చార్ట్ పరిశీలించి, పోలీసు స్టేషను పరిధిలో ఏ తరహా నేరాలు జరుగుతున్నాయి? ఏ ప్రాంతంలో జరుగుతున్నాయి? నేరాల నియంత్రకు నెల్లిమర్ల పోలీసులు తీసుకున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బీట్లు తిరిగే సమయంలో హిస్టరీ షీట్లు కలిగిన వారిని చెక్ చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో గల చంపావతి నది ఏ గ్రామాలు గుండా ప్రవహిస్తుంది, ఇసుక రీచ్‌లు ఎక్కడ ఉన్నాయోనని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి వినియోగదారులపై కఠినంగా వ్యవహరించాలని, గంజాయి సేవించి ఎవరైనా పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రకు దాడులు ముమ్మరం చేయాలని, వేరువేరు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం స్టేషనులో చెడు నడత కలిగిన వ్యక్తుల హిస్టరీ షీట్లును పరిశీలించి, వారిపై హిస్టరీ షీటు నమోదు చేయడానికి గల కారణాలను, ప్రస్తుతం సదరు వ్యక్తి స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రధాన సమస్యలను అధికారులను అడిగి తెలుసుకొని, ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ముందస్తు సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రత, సైబరు నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాశాలలు సందర్శించి, యువతకు అవగాహన కల్పించాలన్నారు. సైబరు నేరాలను దర్యాప్తు చేసేందుకు దర్యాప్తు అధికారులకు త్వరలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట విజయనగరం, చీపురపల్లి డిఎస్‌పిలు ఆర్. గోవిందరావు, చక్రవర్తి, సిఐలు షణ్ముకరావు, బి.వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఈ.నర్సింహమూర్తి, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురపల్లి ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి, డిఎస్‌పి

ఎస్‌పి చొరవతో వీడిన రోబరీ కేసు మిస్టరీ

ఏడాదిన్నర తరువాత పట్టుబడ్డ ప్రధాన నిందితులు
కేసు ఛేదించిన సిఐ, ఎస్ఐలకు నగదు రివార్డు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎస్‌పి వకుల్ జిందాల్ చొరవతో దాదాపు ఏడాదిన్నర కాలంగా పెండింగ్‌లోవున్న హైవే రోబరీ కేసును క్రైం బ్రాంచి పోలీసులు ఛేదించారు. ఇందుకోసం పోలీసులు సాంకేతిక, ఇన్ఫార్మర్ వ్యవస్థను ఉపయోగించారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం....

అవార్డు అందుకుంటున్న క్రైమ్ బ్రాంచ్ ఎస్ఐ భాగ్యం

ఒడిస్సాలోని పర్లాకిమిడికి చెందిన బియ్యం వ్యాపారి కోట్ల వంశీకృష్ణ కారులో వస్తుండగా చోడమ్మ అగ్రహారం వద్ద కాపుగాసిన దొంగల ముఠా కళ్లల్లో కారం జల్లి రూ.50లక్షలు అపహరించి అక్కడి నుంచి ఉడాయించారు. కొద్దిసేపటి తరువాత తేరుకున్న వంశీకృష్ణ పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో కారు డ్రైవరుతో సహా ఆరుగురు నిందితులను అప్పట్లోనే పోలీసులు అరెస్టుచేసి రూ.5.70 లక్షలను రికవరీ చేశారు. ఈకేసులో పర్లాకిమిడి ప్రాంతానికి చెందిన రుద్రపంక్తి మధు ప్రధాన నిందితుడని పోలీసులు గుర్తించారు. ఆ తరువాత ఉన్నతాధికారులు ఈ కేసును పట్టించుకోకపోవడంతో నీరుగారింది. నూతనంగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్ గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు, రోడ్డు ప్రమాదాలతోపాటు దొంగతనాలు, దోపిడీకు సంబంధించిన పెండింగ్ కేసులపైన కూడా దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో 2023 మే నెలలో పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం జాతీయ రహదారిపై జరిగిన రోబరీ కేసుపై ఆరా తీశారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంతోపాటు, వారు దొంగిలించిన డబ్బును కూడా రికవరీ చేయాలంటూ కేసును క్రైం బ్రాంచి పోలీసులకు అప్పగించారు. దీంతో, విజయనగరం డిఎస్‌పి ఆధ్వర్యాన క్రైం బ్రాంచి సిఐ ఎ.సత్యన్నారాయణ, ఎస్ఐలు బి.భాగ్యం తమ సిబ్బందితో ఇటీవల రంగంలోకి దిగారు. నిందితుల గుర్తించి ఓవైపు తమ ఇన్ఫార్మర్ వ్యవస్థ ద్వారా ఆరా తీయడంతోపాటు సాంకేతిక వ్యవస్థను కూడా ఉపయోగించారు. కొద్దిరోజుల వ్యవధిలోనే పూసపాటిరేగ జాతీయ రహదారిపైనే నిందుతులు తచ్చాడుతున్నట్టు గుర్తించారు. పక్కా సమాచారంతో గత నెల 31న మధ్యాహ్నం 1గంట సమయంలో నిందితుడు రుద్రపంక్తి మధును కందివలస సంత వద్ద అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.12.10లక్షల నగదు, రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేసి, విచారణ చేపట్టారు. దోచుకున్న డబ్బులలో రూ.5లక్షలు ఖర్చు చేసి బంగారు వస్తువులను కొనుగోలు చేసినట్లు, కొంత సొమ్ము జల్సాకు ఖర్చుచేసినట్టు, మిగిలిన డబ్బుతో భూమి కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా పట్టుబడినట్టు నిందితుడు మధు అంగీకరించాడు. ఈ దోపిడీ ఘటనకు దారపు గోపాలకృష్ణ అనే న్యాయవాది దర్శకత్వం వహించడం గమనార్హం. అతని నుంచి కూడా పోలీసులు రూ.5.25 లక్షలను రికవరీ చేశారు. దోచుకున్న మొత్తం సొమ్ములో సహాయపడిన నిందితులకు రూ.10లక్షలను పంచి, మిగిలిన మొత్తం ఇద్దరూ చెరో రూ.20లక్షలు చొప్పున తీసుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈమేరకు నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపర్చారు. ఈకేసులో ఎంతో శ్రమించి, ప్రధాన నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన విజయనగరం డిఎస్‌పి ఆర్. గోవిందరావు, సిసిఎస్ సిఐ ఎ.సత్యన్నారాయణ, ఎస్ఐ బి. భాగ్యం, ఎఎస్ఐ ఎ. గౌరీ శంకర్, హెడ్ కానిస్టేబుళ్ళు ఎం.రామకృష్ణారావు, డి.శ్రీనివాసరావులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, ఎస్‌బి సిఐ ఇ. నర్సింహమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- రేగిడి

పెంచిన పింఛన్లతో అవ్వ తాతలు ఎంతో ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం తాటిపాడు గ్రామంలో పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు దూబ ధర్మారావు, మాజీ జెడ్పిటిసి మంతిన ఉష, స్థానిక నాయకులు శ్రీరాములు, బాలి రామినాయుడు, ఎంపిడిఒ శ్యామల కుమారి, పాల్గొన్నారు.

తెర్లాం: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి విటి రామారావు గురువారం పరిశీలించారు. అనంతరం వ్యవసాయ వరి నాట్లను పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఎంపిడిఒ మధుసూదన్‌రావు, ఎఒ సునీల్ కుమార్ ఉన్నారు.

రాజాం: పట్టణంలోని నాలుగు, ఐదు వార్డుల్లో గురువారం ఎమ్మెల్యే కోండ్రు మురళీ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


రేగిడి: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

బొబ్బిలి: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి: పింఛన్ల పంపిణీలో భాగంగా బొబ్బిలి 5వ వార్డు, 13వ వార్డు, బొబ్బిలి మండలంలోని జగన్నాథపురం, రంగారాయపురం గ్రామాలు, బాడంగి మండలంలోని భీమవరం గ్రామంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే బేబినాయన పింఛన్లను పంపిణీ చేశారు. బొబ్బిలి టౌన్‌లో కోరాడ వీధికి చెందిన పామోటి గురునాయుడు ఇటీవల కేదర్నాథ్ యాత్రకు వెళ్లి అక్కడ ప్రమాదవసాత్తు గాయపడిన విషయం తెలుసుకుని ఆయన్ను పరామర్శించారు. 13వ వార్డుకు చెందిన మరో టిడిపి నాయకుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని పరామర్శించారు.

వేపాడ: మండలంలోని సింగరాయిలో గురువారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని ఉత్తరావిల్లి, సోమలింగాపురం, మెరకము డిదాం గ్రామాలలో జరిగే పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే కళా వెంకటరావు పాల్గొన్నారు. సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. పావని, టిడిపి నాయ కులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, తలచుట్ల ఈశ్వరరావు, పిన్నింటి సన్యాసి నాయుడు, మండల రమణ మోహనరావు, కెంగువ ధనంజయ, పేరిచర్ల విజయభాస్కరరావు, పాల్గొన్నారు.

భోగాపురం: పోలిపల్లి, భోగాపురం గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో టిడిపి నియోజకవ్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ల రాంబాబు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈవో సురేష్, నాయకులు రమణ బాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: రాష్ట్రంలో పింఛన్లను 4వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం మండలంలోని చింతలపాలెం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య, చింతలపాలెం సర్పంచ్ మాకెన నవీన్ పాత్రుడు, ఎల్.కోట మాజీ జెడ్పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, మండల తెలుగు యువత కోరుబిల్లి ఉపేంద్ర, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


కొత్తవలస: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మెరకముడిదాం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళా

పింఛను పునరుద్ధరణ

శృంగవరపుకోట: పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన తూర్పాటి పృథ్వి రాజుకు 2019వ సంవత్సరంలో జరిగిన బైక్ యాక్సిడెంట్‌లో తన రెండు కాళ్ల చచ్చుబడిపోయాయి. అప్పటి నుండి నడవడానికి వీలుకాని పరిస్థితుల్లో ఆ యువకుడు మంచానికే పరిమితం అయ్యాడు. గత ప్రభుత్వంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పెన్షన్ నిమిత్తం పదివేల రూపాయలు పెన్షన్ను ఆరు మాసాలు ఆ యువకునికి ఇచ్చి ఆ తర్వాత నుండి నిలుపుదల చేశారు. అప్పటి నుండి పెన్షన్ రాక వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక యువకుడు ఆర్థిక ఇబ్బందులతో జిల్లా కలెక్టర్‌కు అర్జీ చేసుకోగా మరలా పెన్షన్ మజూరు చేశారు. మంజూరైన నూతన పెన్షన్ 15 వేల రూపాయలను గురువారం టిడిపి మండల అధ్యక్షుడు జిఎస్ నాయుడు తన చేతుల మీదుగా యువకునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొనదం మల్లేశ్వరరావు, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్ కుమార్, టిడిపి నాయకులు కాపుగంటి శ్రీనివాసు, పెదగాడ రాజు, బుగత మాస్టర్, బిజెపి నాయకుడు దాశరధి, జనసేన పార్టీ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఎసిడిపిఒపై విచారణ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం ఐసిడిఎస్ పరిధిలోని ఎసిడిపిఒ బి.తవిటినాయుడుపై మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి గురువారం స్థానిక కార్యాలయంలో విచారణ జరిపారు. అంగన్ వాడీ కేంద్రాలు తనిఖీలు చేసే సమయంలో ఆయన ఇబ్బందులకు గురిచేయడంతో మానసికంగా ఇబ్బందిపడుతున్నామని ఇటీవలి ఎమ్మెల్యే లోకం మాధవికి కేవలం డెంకాడ మండలానికి చెందిన 13మంది అంగన్ వాడీ కార్యకర్తలతో పాటు పూసపాటిరేగ మండలానికి చెందిన మరో కార్యకర్త ఫిర్యాదు చేశారు. ఇందులో కొంతమంది యూనియన్ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎమ్మెల్యే గుంటూరులోని ఆశాఖకు చెందిన డైరెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆమె విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో 14 మంది కార్యకర్తలను విడివిడిగా పిలిచి వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఎసిడిపిఒ నుంచి స్టేట్‌మెంటు కూడా తీసుకున్నట్లు తెలిసింది. భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల పరిధిలోని 272 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా సుమారు 500 మంది అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు. కాని ఇందులో ఒకే మండలానికి చెందిన 13మంది మాత్రమే ఫిర్యాదు చేశారు. అయితే మూడు మండలాల పరిధిలోని ఉన్న కొంత మంది సెక్టారు యూనియన్లకు తెలియకుండా ఫిర్యాదు చేశారని కొంతమంది కార్యకర్తలు అంటున్నారు. ఆయనకు మద్దతుగా కొంతమంది సెక్టారు యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఎసిడిపిఒకు మద్దతుగా కార్యాలయానికి వచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాని ఇంతలో కొంత మంది సూపర్‌వైజర్లు ఫోన్ చేసి కార్యాలయానికి ఎవరైనా వస్తే మెమోలు జారీ చేస్తామని చెప్పడంతో రాలేకపోయామని అంటున్నారు. ఇంతలో పూసపాటిరేగ మండలం నుంచి ఒకామె వచ్చినప్పటికి ఆమెను తిరిగి వెనక్కి పంపించేశారు. ఇందులో కొంతమంది సిడిపిఒకు మద్దతు పలుకుతుండగా మరికొంతమంది మాత్రం ఎసిడిపిఒకు మద్దతుగా ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ జరిపిన ఆర్.జె.డి నివేదికను డైరెక్టర్‌కు అందజేయనున్నారు.

కార్యకర్తల విషయంలో ఎటువంటి తప్పుచేయలేదు

ఒక్క డెంకాడ మండలనాకి చెందినవారే నాపై ఫిర్యాదు చేశారు. నేను తప్పు చేసి ఉంటే మిగతా పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన వారు కూడా ఫిర్యాదు చేయాలి కదా. మూడు మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను నిత్యం తనిఖీలు చేస్తుంటాం. మరి నాపై ఫిర్యాదు ఇచ్చిన వారి కేంద్రాలను కూడా తనిఖీల్లో భాగంగానే చేశాను. నేను వారిపట్ల ఎటువంటి తప్పు చేయలేదు.

- తవిటినాయుడు, ఎసిడిపిఒ, భోగాపురం

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన 14 మంది కార్యకర్తలు

కార్యకర్తలను విచారిస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

విచారణ విషయాలు బయటపెట్టలేం

ఎసిడిపిఒ పై కొంత మంది కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అంశాలను బయటకు చెప్పకూడదు. వారందరిని విచారించాం. ఇది సాధారణమైన విచారణే తప్ప ఈ విషయాలను బయటకు చెప్పలేం. విచారణ నివేదికను మా అధికారులకు అందజేస్తాం.

- జి. చిన్మయిదేవి, ఆర్‌జెడి

టిడ్కో రుణాలపై సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయన ఆధ్వర్యంలో గురువారం ఎపి టిడ్కో ఇళ్ల రుణాలపై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలో ఇప్పటివరకు 336 ఇళ్లలో 276 ఇళ్లకు రూ.12.02 కోట్లకు గాను రూ.6.25 కోట్లు రుణాలు మంజూరు చేశామని బ్యాంకర్లు చెప్పారు. వాటి మారోటోరియం గడువు 24 నెలలు దాటిపోయినా ఇంతవరకు ఇఎంఐ డబ్బులు చెల్లించలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బకాయి పడ్డ అదనపు మొత్తాన్ని చెల్లించి అటు బ్యాంకులకు, ఇటు లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పై అధికారులతో, మంత్రితో మాట్లాడి సమస్య లేకుండా చేయడానికి కృషి చేస్తామన్నారు. త్వరలో ఇళ్లు, మౌలిక వసతుల కల్పన పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని అంతవరకు బ్యాంకర్లు లబ్ధిదారులకు ఫోన్ చేసి ఇఎంఐ చెల్లించమని డిమాండ్ చేయొద్దని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి, టిడ్కో ఇఇ వరి, ఎస్‌బిఐ, కెనరాబ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, డిసిసిబి ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపాల పట్ల నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- బొండపల్లి

బిడ్డలకు తల్లిపాలు పెట్టడంలో తల్లులు నిర్లక్ష్యం వహించ కూడదని గంట్యాడ సిడిపిఒ ఉమా భారతి అన్నారు. గురువారం ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు సందర్భంగా మండలంలోని గొట్లాం గ్రామంలో తల్లి పాలు ప్రాముఖ్యతపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు కలుషితం లేని శ్రేష్టమైనవని వీటిని పట్టడం ద్వారా బిడ్డలోని రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్‌వైజర్ జానకి, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

రేగిడి: పుట్టిన వెంటనే బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చలమయ్య అన్నారు. గురువారం బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు. తల్లి మర్రిపాలు ఎంతో ఆరోగ్యకరమైనవి అని తెలిపారు. ఈ కార్యక్రంమలో హెల్త్ విస్తరణ అధికారి రాధాకృష్ణ, పిహెచ్ఎన్ సావిత్రి, సూపర్‌వైజర్లు సాయికృష్ణ, లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

బొబ్బిలి: తల్లి పాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని పూల్‌బాగ్ పాఠశాల అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లిపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లి పాలుతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. తల్లి పాలు తాగించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు అరుణ, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: స్థానిక పిహెచ్‌సిలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్‌ను వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వర్మ ప్రారంభించారు. ప్రధానంగా తల్లి పాల విశిష్టత, గంటలోపు ముర్రుపాలు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రి లో ప్రసవించిన తల్లులకు బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్, కంగారూ పద్ధతిలో తల్లి బిడ్డకు పాలు ఇచ్చు విధానాన్ని వివరించారు. అనంతరం గోడ, కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు వేదమని, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకులు ఆర్. వి. రమణ, నర్స్ స్వాతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడంగి: ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలని ఐసిడిఎస్ సిడిపిఒ రాజ్యలక్ష్మి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డెలివరీ అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలన్నారు.

శృంగవరపుకోట: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: మహిళలు డెలివరీ అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని ఐసిడిఎస్, ఎస్.కోట సెక్టార్ సిడిపిపిఒ ఉమా అన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మొదటి రోజు గురువారం పట్టణంలోని బర్మా కాలనీలో గల అంగన్వాడి కేంద్రంలో డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో సిడిపిఒ ఉమా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు, ఆశాలు, అంగన్వాడీలు, బర్మా కాలనీకి చెందిన మహిళలు తదితరులు పాల్గొన్నారు.